సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 17 । మార్చి । 2023



లింక్ ఓపెన్ చేసినా.. ఫోన్ మాట్లాడినా

గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు ఓపెన్ చేయడం.. డిస్‌ప్లేలో ఇచ్చే నంబర్లకు కాల్ చేయడం లాంటివి చేయవద్దని సిద్దిపేట సీపీ శ్వేత సూచించారు. 8లో



హల్దీలో ప్రమాదాలకు చెక్

నాచారం గుట్ట హల్దీ చెక్‌డ్యాం వద్ద యాత్రికులకు రక్షణగా ప్రత్యేక కవచాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ముప్పు వాటిల్లకుండా రక్షణ చర్యలు చేపట్టారు. 8లో



పారదర్శకంగా సంక్షేమ పథకాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకతతో అమలు చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 9లో

వాన హైరానా

- జిల్లాలో పలుచోట్ల వడగళ్ల వర్షం
- ఈదురుగాలులకు ఎగిరిపడిన ఇళ్ల పైకప్పులు
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు.. దెబ్బతిన్న పంటలు
- న్యాల్‌కల్‌లో 3.8 సెంటీమీటర్లు నమోదు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో గురువారం పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొన్నిచోట్ల వడగండ్ల వాన పడింది. ఉదయం 11 గంటల నుంచే వాతావరణం మేఘావృతమైంది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలో పలు చోట్ల నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. అత్యధికంగా న్యాల్‌కల్‌లో 3.8 సెం.మీల వర్షపాతం రికార్డు అయింది. రాయికోడ్‌లో 2.8 సెం.మీలు, కోహీర్ 2.6 సెం.మీలు, నత్వార్ (జహీరాబాద్) 2.3 సెం. మీలు, మేల్చల్మా (జహీరాబాద్) 2.2 సెం.మీల వర్షపాతం నమోదయింది.



కోహీర్(జహీరాబాద్): బడంపేటలో పైకప్పు ఎగిరియిన ఇంటి ఎదుట భూమయ్య

కోహీర్(జహీరాబాద్): ఉరుములు.. మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. గురువారం ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులతో కూడిన వర్షంతో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడటంతో పట్టణాల ప్రజలు ఆహ్లాదం పొందారు. కోహీర్ మండలంలో వడగళ్ల వానకు విద్యుత్ సరఫరాకు, ఫోన్ల సేవలకు అంతరాయం ఏర్పడింది. బడంపేటలో ఇంటిపైకప్పు ఎగిరిపోయింది. కోతకొచ్చిన చింత, శనగ, తదితర పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే బడంపేట, మనియార్‌పల్లి, పైడిగుమ్మల్, బిలాల్‌పూర్, కొత్తూర్(కె) ఖానాపూర్ గ్రామాల్లో వర్షం కురిసింది. బడంపేటలో భూమయ్యకు చెందిన ఇంటి పైకపప్పు రేకులు ఎగిరిపోయి దూరంగా పడ్డాయి. బాధిత కుటుంబానికి ఆర్‌ఐ సత్యనారాయణ ఆశ్రయం కల్పించారు. బడంపేట, పర్సపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన చెట్టుకూలి విద్యుత్ తీగెలు తెగిపడ్డాయి. ఆ శాఖ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.



కోహీర్(జహీరాబాద్): బడంపేట గ్రామంలో కురిసిన వడగళ్లు

నేలవాలిన జొన్న



అత్నూర్ గ్రామంలో నేలవాలిన జొన్న పంట

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఆకాశం మేఘాలతో కమ్ముకొన్నప్పటికీ మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో శనగ, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. అత్నూర్ గ్రామ శివారులో జొన్న పంట నేలవాలింది. పంట పొలాల వద్ద నిల్వ ఉంచిన పత్తి కూడా కొంత మేర దెబ్బతింది. గాలి వానకు మిర్జాపూర్(ఎన్) గ్రామంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

రాకపోకలకు అంతరాయం



జహీరాబాద్ అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు

జహీరాబాద్ టౌన్/ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్, ఝరాసంగం ప్రాంతాల్లో ఈదురుగాలులతో పాటు వడగళ్లు పడ్డాయి. మధ్యాహ్నం వరకు ఎండకాయగా ఒక్కసారిగా వాతవరణం మారింది. బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు వద్ద గల అండర్ బ్రిడ్జిలో నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. అకాల వర్షంతో మామిడి తోటలు దెబ్బతిన్నాయని, పిందలపై వడగళ్లు పడటంతో కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఝరాసంగంతో పాటు మేదపల్లి, బోరేగావ్, బర్దిపూర్, కుప్ప నగర్ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. చేతికొచ్చిన శనగ పంట కోసేందుకు ఇబ్బందులు తప్పవని, జొన్న కంకులు రంగు మారుతాయని రైతులు చెబుతున్నారు. అలాగే అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది.



సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్, సంస్కృతం పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఒక గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 15,077 మంది విద్యార్థులకు గాను 14,622 మంది విద్యార్థులు హాజరయ్యారని, 455 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి గోవింద్ రామ్ తెలిపారు. డీఈసీ సభ్యులు నాలుగు పరీక్షా కేంద్రాలను, హెచ్‌పీసీ సభ్యులు నాలుగు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఎనిమిది, సిట్టింగ్స్ స్క్వాడ్స్ నాలుగు కేంద్రాలను, డీఐఈఓ రెండు కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

'నల్లవాగు' చివరి ఆయకట్టుకూ నీరు



నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): నల్లవాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మార్డి, బీబీపేట, పోచాపూర్, గోసాయిపల్లి ప్రాంతాల్లో నల్లవాగు ప్రాజెక్ట్ కాల్వలను పరిశీలించారు. బైక్‌పై తిరుగుతూ నీటి సరఫరాను పర్యవేక్షించారు. అడ్డుకట్టలు తొలగించి నీటి సరఫరా సక్రమంగా జరిగేల చర్యలు చేపట్టాలన్నారు. యాసంగి సాగు కోసం చివరి తడి వరకు నీటిని సరఫరా చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆత్మ కమిటీ చైర్మన్ రాంసింగ్, సర్పంచ్ కిష్టారెడ్డి కాల్వల్లో ఉన్న అడ్డుకట్టలను తొలగించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈఈ జైభీం, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిష్టాగౌడ్, నాయకులు కిషన్‌రెడ్డి, మారపు సాయిలు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: మహిళలకు అండగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన మహిళా ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ఉద్యోగం చేసే చోట ఏమైనా ఇబ్బందులకు గురైతే ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధ్యులను శిక్షించేందుకు వీలుగా పలు చట్టాలు ఉన్నాయని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. పిల్లలు ఇంటర్‌నెట్, సోషల్ మీడియాలో ఏం చూస్తున్నారో గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కుటుంబ పోషణలో మహిళల పాత్ర కీలకమైనదని.. భూమికి ఉన్నంత ఓపిక మహిళలకు ఉంటుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నర్సాపూర్ యూనిట్ అధ్యక్షుడు శేషాచారి, కార్యదర్శి రాకేష్, ఇతర ప్రతినిధులు చెన్నయ్య, నర్సింహారెడ్డి, సరళకుమారి, శ్రీనివాస్, రాఘవేందర్‌రావు, సీడీపీఓ హేమాభార్గవి, ఏడీఏ సురేఖ, ఎక్సైజ్ ఎస్ఐ అరుణ, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, కౌన్సిలర్ పంబాల లలిత తదితరులు పాల్గొన్నారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న చుక్క రాములు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

కొండాపూర్(సంగారెడ్డి): అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. గురువారం కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చుక్క నర్సయ్య 9వ వర్ధంతికి హాజరై మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయిధ రైతాంగ పోరాట ప్రభావంతో భూస్వామ్య వ్యవస్థ అంతమైందని గుర్తు చేశారు. ఆ పోరాట స్ఫూర్తికి చుక్క నర్సయ్య ఆకర్షితులై ప్రజల కోసం పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆయన చూపిన ఆదర్శాలు, పోరాట తెగువను అందుకొని తనతోపాటు అనేకమంది కమ్యూనిస్టు ఉద్యమంలో పాలుపంచుకున్నారన్నారు. అమరుల ఆశయ సాధనకు బలమైన ప్రజా పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ పూర్తి కాలం కార్యకర్తల పిల్లలకు చుక్కా నర్సయ్య మెమోరియల్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్, నాయకులు ఎస్.రమ, బి.మల్లేశం, కే.రాజయ్య, మాణిక్యం, సాయిలు, నర్సింలు, యాదవరెడ్డి, యాదగిరి, విద్యాసాగర్, చిరంజీవి, అశోక్, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో.. ఎల్లమ్మ ఆలయం వద్ద ఒడి బియ్య పోగు చేసుకునే తాత్కలిక లైసెన్స్ కోసం 20వ తేదీన సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు దరావత్‌గా రూ.లక్ష డీడీని ఏదైన జాతీయ బ్యాంకులో కార్యనిర్వాహణధికారి శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానము ,కొమురవెల్లి పేరుమీద చెల్లుబాటు అయ్యేవిధంగా 20.03.2023 రోజు మధ్యాహ్నం ఒంటి గంట వరకు షెడ్యూలుకు జతపరిచి టెండర్ బాక్సులో వేయాలని తెలిపారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమా?



సంగారెడ్డిలోని ఐబీ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్

కొండాపూర్(సంగారెడ్డి): నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ చెలగాటమాడుతోందని, తక్షణమే ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఐబీ వద్ద తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) వెబ్ సైట్ హ్యాకింగ్, లీకేజీపై న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ హ్యాకింగ్, లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ అధికారుల ప్రమేయం లేకుండా ప్రశ్న పత్రాలు లీక్ అయ్యే అవకాశం లేదని, పేపర్ లీకేజీపై అనేక అనుమానాలున్నాయన్నారు. రాసిన, రాయాల్సిన ఉద్యోగ పరీక్షలతో పాటు నియామక ప్రక్రియలు నిలిచిపోతాయని అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ హర్షిత్, రామకష్ణ, సునీల్, నరేశ్, శ్రీకాంత్, ప్రశాంత్, రాములు, విల్సన్, నరేందర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 118 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఏప్రిల్ మూడు నుంచి 13 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, వేసవి దృష్టా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి అనుమతించరన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచి నీరు, టాయిలెట్స్, సరైన వెలుతురు ఉండేలా చూడాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా రూట్ల వారీగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ సూచించారు.

26 స్టోరేజీ పాయింట్లు

పరీక్షల నిర్వహణకు జిల్లాలో 118 పరీక్ష కేంద్రాలను, 26 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశామని, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లను, 18 మంది రూట్ ఆఫీసర్లను, 118 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 118 మంది డిపార్ అధికారులను, ఒక అడిషనల్ డిపార్ అధికారిని, సుమారు 1100 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్ వివరించారు. ఈ పరీక్షలకు 21,389 మంది రెగ్యులర్, 24 మంది ప్రైవేట్, 1131 మంది ఒకేషనల్ అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ విజయ, అసిస్టెంట్ ఎగ్జామినేర్ మణిదీప, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ కవిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలకు సిద్ధం చేయాలి

స్థాయి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను అన్నివిధాల సన్నద్ధం చేయాలని కోరారు. ఆయా సబ్జెక్టు టీచర్లు ప్రధానోపాధ్యాయులు యూనిటీగా కృషి చేస్తే వంద శాతం ఫలితాలను సాధించవచ్చన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను కొనసాగించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రాజేశ్, జిల్లా విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ విజయ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి




పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న నవీన్‌కుమార్

జిన్నారం(పటాన్‌చెరు): చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, దీనికోసం తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోషణ్ అభియాన్ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. జిన్నారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార లోపం ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నవీన్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు తల్లిదండ్రులకు అవగాహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోషకాహార ప్రాముఖ్యత, బాలామృతం ఉపయోగాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కొండాపూర్(సంగారెడ్డి): ఐదో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు సంగారెడ్డి, మెదక్ గురుకులాల ఆర్‌సీఓ భీమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరికి కరోనా పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 23 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 17 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

20న అప్రెంటిస్ మేళా

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20వ తేదీన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం apprenticeship.gov.in అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఒక వేళ రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు సంగారెడ్డిలోని ఐటీఐలో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ మేళాకు సుమారు 20 కంపెనీలు వస్తున్నాయని, వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అప్రెటింస్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 9 గంటలకు నిజ ధ్రువపత్రాలు (రెండు సెట్ల జిరాక్స్) తీసుకొని హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు 9848935146, అప్రెంటిస్ అడ్వైజర్ మహేశ్ 949314844ను సంప్రదించాలని సూచించారు.

'టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి'

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రశ్నార్థకం చేసిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఉదంతాన్ని నిరసిస్తూ గురువారం సంగారెడ్డిలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా ఉద్యోగ నోటిఫికేషన్లు లేకుండా సీఎం కేసీఆర్ ఒక తరం విద్యార్థుల జీవితాలను ఆగం చేశాడని ఆరోపించారు. హడావిడిగా నోటిఫికేషన్లు జారీ చేసి ప్రశ్న పత్రాల లీకేజీతో నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజగౌడ్, శశాంక్, వెంకటరెడ్డి, తనజీ, ప్రవీణ్, అజయ్, దేనిశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. హనుమాన్‌నగర్‌లో గురువారం సాయంత్రం గృహాలకు హై ఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, సెటప్ బాక్స్‌లతో పాటు పలు ఎలక్ట్రానిక్స్ పరికరాలు కాలిపోయామని బాధితులు ముత్యాలు, యాదగిరి, బాలరాం, నారాయణ, సత్తయ్య ఆరోపించారు. విద్యుత్ సరఫరాఅయ్యే లైన్ పైనుంచి వాటర్ పైప్ వేయడం వల్ల వైర్లు ఒకదానికొకటి ఆనుకొని హైఓల్టేజీ వచ్చిందని వారు ఆరోపించారు. తమకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

పాఠశాలలో మద్యం బాటిళ్లు



నారాయణఖేడ్: జూకల్ శివారులోని ప్రాథమిక పాఠశాల గదుల్లో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి విందుభోజనాలు చేశారు. గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గదుల్లో మద్యం సీసాలు, విందు చేసిన సామగ్రి, చెత్తాచెదారం, మిగిలిన ఆహారపదార్థాలు చూసి ఆందోళనకు గురయ్యారు. పాఠశాలకు ప్రహరీ, రక్షణ లేకపోవడంతో తరచు ఇలాంటి సంఘటనలు వెలుగు చూస్తున్నాయి.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఓ బాలిక(16) ఈనెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు రాగా, ఓ వ్యక్తి వచ్చి తీసుకెళ్లినట్టు స్థానికుల ద్వారా కుటుంబసభ్యులు తెలుసుకున్నారు. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తమ కూతురు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో 20 మంది పట్టుబడ్డారు. గురువారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 16 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించగా, ముగ్గురికి మూడు వేలు, మరో వ్యక్తికి రూ.2500 జరిమానా విధించారు.

హల్దీలో ప్రమాదాలకు చెక్

- నాచగిరి వచ్చే భక్తులకు రక్షణ కవచం
- చెక్‌డ్యాంలో కంచె ఏర్పాటు

వర్గల్(గజ్వేల్): హల్దీ చెక్‌డ్యాం వద్ద యాత్రికులకు రక్షణకు ప్రత్యేక కవచం ఏర్పాటు చేశారు. స్నానాలు చేసేందుకు కొందరు, సరదాగా ఈత కొట్టాలనే ఉబలాటంతో మరికొందరు ఇందులోకి దిగి ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం నాచగిరి బ్రహ్మోత్సవాలు జరుగుతుండడం, చెక్‌డ్యాం నీటితో నిండుగా కళకళలాడుతుండడంతో భక్తులకు ముప్పు వాటిల్లకుండా రక్షణ చర్యలు చేపట్టారు.

మూడేళ్లుగా హల్దీకి జలకళ..

- హల్దీవాగుకు అనుసంధానమైన నాచారం గుట్ట చెక్‌డ్యాం వానకాలం వర్షాలు సమృద్ధిగా కురిస్తే తప్ప నిండేది కాదు. ఎప్పుడో ఒకసారి నిండినా, వేసవికి ముందే నీరు అడుగంటి వట్టిపోయేది. వేసవిలో నాచగిరీశుని బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఆ వైపు వెళ్లేవారు కాదు.
- కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల విడుదలతో మూడేళ్లుగా మండు వేసవిలోనూ నాచారంగుట్ట హల్దీచెక్‌డ్యాంకు జలకళ సంతరించుకుంటోంది.
- ఆహ్లాదకరంగా మారిన నాచగిరి చెక్‌డ్యాం వైపు పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు సహజంగానే ఆకర్షితులవుతున్నారు.
- నదీ స్నానం, వేసవి ఉపశమనం కోసం కొందరు, ఈత కొట్టాలని ఆనందంలో మరికొందరు, మద్యం మత్తులో కొందరు చెక్‌డ్యాంలోకి దిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు న్నాయి.

ఎన్నెన్నో ప్రమాదాలు..

- గతేదాది 2022 ఏప్రిల్ 13న వర్గల్ మండలం బొర్రగూడెం గ్రామస్తుడు తిరుపతి హల్దీ చెక్‌డ్యాంలో మునిగి దుర్మరణం చెందాడు.
- ఏప్రిల్ 17న నర్సింలు హల్దీ వాగులో కొట్టుకుపోయి శవమై తేలాడు.
- మే 29న ఆదివారం హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు ఓంప్రకాశ్, సురేందర్ చౌదరిలు ఈత కోసం చెక్‌డ్యాంలో దిగి దుర్మరణం చెందారు.
- అక్టోబర్ 7న అనంతగిరిపల్లికి చెందిన ఎల్లంకుల స్వామి హల్దీ ప్రవాహంలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు.
- 2021 బ్రహ్మోత్సవాల తరుణంలోనూ ఇద్దరు పిల్లలు చెక్‌డ్యాం ప్రవాహంలో కొట్టుకుపోతుండగా స్థానికులు రక్షించారు. ఆ పిల్లలు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.
- ఇవేకాకుండా మరెందరో మృత్యువు అంచుల దాకా వెళ్లి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడిన సంఘటనలు ఉన్నాయి.



నాచారం హల్దీ చెక్‌డ్యాంలో ఏర్పాటుచేసిన ఇనుప తీగల మెష్



చెక్‌డ్యాం వద్ద హెచ్చరిక బ్యానర్

దాత సహకారంతోనే..

చెక్‌డ్యాంలో ప్రమాదాల నివారణకు యంత్రాంగం పెద్దగా చర్యలు చేపట్టలేదు. రక్షణ చర్యలు బోర్డు ఏర్పాటుకే పరిమితమయ్యాయి. దీంతో నాచారం గ్రామానికి చెందిన బాదె జయకుమార్ అనే దాత చెక్‌డ్యాంలో ఇనుప తీగలతో కూడిన 'మెష్' బిగింపజేశారు. దీంతో స్నానాలకు దిగిన యాత్రికులు లోతు ప్రాంతంలోకి వెళ్లకుండా ఈ మెష్ అడ్డుపడుతుంది. మరోవైపు ప్రమాదవశాత్తు ఎవరైన మునిగిపోతే రక్షించేందుకు ఇద్దరు గజ ఈతగాళ్లను సైతం అక్కడ నియమించారు.

యాత్రికుల రక్షణకే..



మాది నాచారం గ్రామం. నాచారం గుట్టకు ఎక్కడెక్కడి నుంచో యాత్రికులు వస్తుంటారు. గుడి వద్ద హల్దీ చెక్‌డ్యాంలో ఎందరో మునిగి ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారి కుటంబ సభ్యుల రోదనలు చూసి బాధగా అనిపించింది. యాత్రికులకు రక్షణ సమకూర్చాలనుకున్న. మానవతా దృక్పథంతో నా వంతుగా చెక్‌డ్యాం లోతుదాకా యాత్రికులు వెళ్లకుండా 'మెష్' ఏర్పాటు చేయించాను.

–బాదె జయకుమార్, దాత, నాచారం

జాగ్రత్తలు తీసుకున్నాం



హల్దీ చెక్‌డ్యాంలో దాత సహకారంతో మెష్ ఏర్పాటు చేశాం. స్నానానికి దిగే యాత్రికులు లోతు ప్రాంతంలోకి వెళ్లే ఆస్కారం ఉండదు. ముందస్తుగా చెక్‌డ్యాం వద్ద ఇద్దరు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశాం. చెక్‌డ్యాం వద్ద నిరంతరం నిఘా కొనసాగుతుంది. తగు జాగ్రత్తలు తీసుకోకుండా యాత్రికులు నిర్లక్ష్యంగా హల్దీ వాగులోకి దిగొద్దు.

–కట్టా సుధాకర్‌రెడ్డి, ఆలయ సహాయ కమిషనర్

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని జహీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారు దొంగలించిన ఏడు తులాల బంగారంతో పాటు వినియోగించిన మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ ఆ వివరాలు వెల్లడించారు. బీదర్‌కు చెందిన విజయరావు, సురేష్‌రావులు మోటారు బైక్‌పై జహీరాబాద్‌తో తిరుగుతూ ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్ చేస్తున్నారు. హౌసింగ్‌బోర్డు, దత్తగిరికాలనీ, చెన్నారెడ్డినగర్ కాలనీ, రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నాలుగు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలను దొంగలించారు. వాటిని కరిగించి అమ్మేందుకు సిద్ధం కాగా, నమ్మదగిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేశామన్నారు. బీదర్‌లో కూడా వీరిపై కేసులుఉండగా, ఇటీవలె బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చారన్నారు. జహీరాబాద్‌టౌన్ సీఐ, భూపతి, ఎస్ఐ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నయా బాటలో బల్దియా

- ఇక కాన్వాస్ టార్పాలిన్ బ్యాగుల వినియోగం
- రోడ్ల వెంబడి చెత్త లేకుండా తరలించేందుకు..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఎన్నో క్లిష్టమైన సమస్యలు సైతం పరిష్కారమవుతున్నా 'చెత్త'వి మాత్రం తీరడం లేదు. జీహెచ్‌ఎంసీ చెత్త సమస్యల పరిష్కారానికి చేస్తున్న ఆలోచనలు ఫలితాలనివ్వకున్నా ఏడాదికో కొత్త ఆలోచనతో తోచినవి చేస్తున్నారు. తాజాగా రోడ్ల వెంబడి ఇతరత్రా ప్రాంతాల్లో పోగుపడే చెత్తకుప్పలు లేకుండా చేసేందుకు, వాహనాలు వాటిని తరలించేంత వరకు నిల్వ చేయడానికి కాన్వాస్ టార్పాలిన్ వాటర్ ప్రూఫ్ బ్యాగులు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. చెత్త పోగుపడే ప్రాంతాల్ని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీ)గా పిలుస్తున్నారు. జీవీపీల్లోని చెత్తను తరలించేందుకు వాహనాలు వచ్చేంతదాకా చెత్త రోడ్లపై లేకుండా బ్యాగుల్లో వేసేందుకు రోడ్లు శుభ్రపరిచే పారిశుధ్య కార్మికుల గ్రూపులకు వీటిని పంపిణీ చేస్తారు. తద్వారా రోడ్లపై చెత్త కనిపించకుండా ఉంటుందన్నది జీహెచ్‌ఎంసీ ఆలోచనగా కనిపిస్తోంది.

ర్యాంకుల మోజులో పడి..

అసలు సమస్య ఇళ్లనుంచి ప్రతిరోజూ చెత్త తరలింపు జరగకపోవడం. మరోవైపు స్వచ్ఛ భారత్ ర్యాంకింగ్స్ కోసం ఆయా ప్రాంతాల్లో ఉన్న డంపర్ బిన్లను తొలగించడం. ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త తరలింపు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నాక డంపర్ బిన్లను తొలగించాల్సింది. కానీ.. ర్యాంకుల మోజులో పడి డంపర్ బిన్లు తొలగించారు. దాంతో, ప్రతిరోజూ ఇళ్లకు చెత్త సేకరించే కార్మికులు రాక ప్రజలు ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. దాంతో జీవీపీలు పెరిగిపోతున్నాయి. కనీసం డంపర్‌బిన్లు ఉన్నా చెత్తను వాటిల్లో వేసేవారు. చెత్త తరలించాల్సిన స్వచ్ఛ ఆటోలు వెళ్లాల్సిన ఇళ్లకు వెళ్లకున్నా పట్టించుకోవడం లేదు. వాటికి జీపీఎస్‌లు, ఇళ్ల నుంచి తరలించినట్లు క్యూఆర్‌కోడ్‌లు వినియోగిస్తామని చేసిన ప్రకటనలు సైతం కార్యరూపం దాల్చలేదు.

5700 బ్యాగులు కొనుగోలుకు సిద్ధం

3.5 అడుగుల ఎత్తు, 2 ఫీట్ల డయామీటర్ కలిగిన కాన్వాస్ టార్పాలిన్ బ్యాగుల్ని కొనుగోలు చేసేందుకు ఏజెన్సీల ఎంపికకు సిద్ధమయ్యారు. ఆర్ఎఫ్‌పీ ద్వారా ముందుకొచ్చే ఏజెన్సీల్లో ఎల్1 రేటును ఖరారు చేయడంతో పాటు ఎల్1 రేటుకే సరఫరా చేసేందుకు ఇతర ఏజెన్సీలు ముందుకొచ్చినా వాటికి కూడా సరఫరా అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా ఈ సంవత్సరానికి 5700 బ్యాగులు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. శేరిలింగంపల్లిసర్కిల్‌లో 574 బ్యాగులు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదించారు.

పోచారం ప్రాజెక్టులో దూకి.. యువకుడి ఆత్మహత్య



భిక్షపతి(ఫైల్)

మెదక్ రూరల్: ఓ యువకుడు పోచారం డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మెదక్‌లోని గాంధీనగర్‌కు చెందిన చింతల భిక్షపతి (32) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పు తీర్చేమార్గం కనిపించక గురువారం మధ్యాహ్నం పోచారం ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

రామాయంపేట(మెదక్): చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద సత్యనారాయణ(45) ఆత్మహత్య చేసుకున్నాడు. నార్సింగి ఎస్ఐ నర్సింలు కథనం ప్రకారం.. శుక్రవారం సత్యనారాయణ ఇంటినుంచి వెళ్లిపోయాడు. దీంతో అతని కుమారుడు, ఇతర బంధువులు గాలిస్తున్న క్రమంలో వల్లూరు అటవీ ప్రాంతంలో చెట్టుకు వేలాడుతూ సత్యనారాయణ మృతదేహం కనిపించింది. మాబాబాయితో జరిగిన గొడవల కారణంగానే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుమారుడు రాజు ఆరోపించారు. ఈమేరకు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నలుగురికి జైలు

జహీరాబాద్ టౌన్: ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి చేసిన నలుగురికి 3 నెలల జైలుశిక్ష విధిస్తూ జహీరాబాద్ జూనియర్ సివిల్ జడ్జి అనూష గురువారం తీర్పు ఇచ్చారని చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. మండల పరిధిలోని గోవిందాపూర్‌లో వాసుబాబుకు వ్యవసాయ భూమి ఉంది. 2016లో ఆయన పొలంలో ట్రాక్టర్ డ్రైవర్ పూజారి దుక్కి దున్నుతున్నాడు. అదే గ్రామానికి చెందిన అశోక్, శంకర్, పండిరి, కాశీంపూర్‌కు చెందిన తిప్పల గోపాల్‌లు అకారణంగా ట్రాక్టర్ డ్రైవర్ పూజారిపై దాడి చేశారు. వాసుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పూర్తి విచారణ అనంతరం నలుగురికి శిక్ష పడింది.

బొలేరో వాహనం ఢీకొని..

చేగుంట(తూప్రాన్): బైకుపై వెళుతుండగా, బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..నేపాల్‌కు చెందిన మిలన్ అలియాస్ లక్ష్మణ్ (45) పది సంవత్సరాలుగాచేగుంట, తూప్రాన్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడిపిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం చేగుంట బైపాస్ నుంచి తూప్రాన్ వైపునకు బైక్‌పై మిలన్ వెళుతుండగా, వెనుక నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మిలన్ అక్కడికక్కడే మృతి చెందగా, అదే బైకుపై ఉన్న సుమన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సుమన్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించారు.



మిలన్ మృతదేహం

12 గొర్రెలు అపహరణ

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలను ఎత్తుకెళ్లారు. భానూర్- బీడీఎల్ ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం...మండల పరిధిలోని పాశమైలారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్ వ్యవసాయంతో పాటు గొర్లను పెంచుతున్నాడు. గ్రామంలో ఉన్న బీరప్పగుడి ఖాళీ స్థలంలో 6వ తేదీన గొర్రెలను మేపుకొని వచ్చి శ్రీనివాస్ తండ్రి చంద్రయ్య జాలిలో ఉంచి, భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. రాత్రి బీరప్ప గుడి వద్దకు వచ్చి పడుకున్నాడు. 7వ తేదీ ఉదయం గొర్రెలు అరుస్తూ ఉండగా, నిద్రలేచిన చంద్రయ్య వచ్చి చూడగా గొర్ల జాలి కట్ చేసి ఉండగా, అందులో 12 గొర్రెలు పోయినట్టు గుర్తించాడు. వాటికోసం స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల గుర్తుతెలియని ఇద్దరి మృతి

జహీరాబాద్‌లో వ్యక్తి...

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఈద్గా సమీపంలోని పశువుల సంత, పండ్ల మార్కెట్ వద్ద గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందినట్టు జహీరాబాద్ టౌన్ ఎస్ఐ. శ్రీకాంత్ తెలిపారు. సుమారు 65 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి కొద్ది రోజులుగా పండ్ల మార్కెట్, పశువుల ప్రాంతంలో ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడని, శవాన్ని జహీరాబాద్ ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డిలో మహిళ ....

సంగారెడ్డి టౌన్ : గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్టు సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం ఉదయం సంగారెడ్డిలోని మహబూబ్ సాగర్ చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందని సమాచారం ఇచ్చారు. కాళ్లు చేతులు మెడ ఒకే దగ్గర కట్టి గోనెసంచిలో వేసి చెరువులో పడేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. మృతురాలి వయస్సు 25 ఏళ్లు ఉంటుందన్నారు.

చనిపోయారని...

నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్‌కు యత్నం

మనోహరాబాద్(తూప్రాన్): బతికుండగానే ఒకరు చనిపోయినట్టు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించారు. ధరణిపోర్టల్‌లో సక్సేషన్‌కు ప్రయత్నించారు. అసలు పట్టాదార్‌కు మెసేజ్ రావడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలపరిధిలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన బుక్క లలిత పేరు మీద రెండు సర్వేనంబర్లలో 38 గుంటల భూమి ఉంది. డెత్ సర్టిఫికెట్ సృష్టించి భూమిని కాజేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించారు. ఆమె ఫోన్‌కు మెసేజ్ రావడంతో గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసింది. తహసీల్దార్ భిక్షపతిని వివరణ కోరగా నిజమేనన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.



తహసీల్దార్ భిక్షపతికి ఫిర్యాదు చేస్తున్న లలిత

'నాకు న్యాయం చేయండి'

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తనతో ప్రేమలో ఉన్న యువకుడు మరో అమ్మాయితో నిశ్చితార్థానికి సిద్ధమయ్యాడని, దానిని నిలిపివేసి న్యాయం చేయాలంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే... రామచంద్రాపురం పట్టణంలో నివాసముండే వినూత్నేశ్వరి ఈర్ల ప్రశాంత్ ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఎంతో ఆప్యాయంగా ఉండే ప్రశాంత్ నెలరోజుల నుంచి కనిపించడం లేదు. శుక్రవారం మరో అమ్మాయితో నిశ్చితార్థానికి సిద్ధమైనట్టు తెలిసింది. విషయం తెలియగానే మనోవేదనకు లోనై వినూత్నేశ్వరి గురువారం ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆర్యోగం నిలకడగానే ఉంది. ప్రేమపేరుతో తనను మోసం చేసిన ప్రశాంత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ సూచించారు. గురువారం కల్హేర్‌లో ఐకేపీ మహిళ సంఘాల సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన కలిపించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్ అకౌంట్, ఆధార్ వివరాలు, ఓటీపీ చెపొద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీలు సాయిలు, నర్సింహులు, అరుణ పాల్గొన్నారు.

రేజింతల్‌లో 'పులి'కలకలం

న్యాల్‌కల్(జహీరాబాద్):మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో పులి సంచరిస్తుందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం మధ్యాహ్నం వేళ పులి కనిపించిందని రైతులు గ్రామంలోకి పురుగెత్తుకొచ్చారు. దీంతో మరికొందరు కలిసి అక్కడకు వెళ్లారు. మళ్లీ పులి కనిపించందంటూ అందరూ పెద్దగా కేకలు వేస్తూ గ్రామంలోకి వచ్చారు. వెంటనే విషయాన్ని జహీరాబాద్ అటవీ అధికారులకు చెప్పారు. రైతులు చూసింది పులినా..ఇతర జంతువా అని తెలుసుకునేందుకు అధికారులు వాట్సాప్ ద్వారా పులి, హైనా ఫొటోలు పంపించారు. రైతులు చెప్పిన వివరాలను బట్టి హైనానే అని అధికారులు చెబుతున్నారు. అటవీ విస్తీర్ణం పెద్దగా లేనందున పులి వచ్చే అవకాశం లేదన్నారు. ఐదు నెలల క్రితం కూడా రైతులు గ్రామశివారులో పులి సంచరిస్తుందంటూ ఆందోళన చెందిన విషయం తెలిసిందే. వర్షం కారణంగా సంఘటనస్థలానికి రాలేకపోయామని, శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తామని, అప్పటివరకు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు అన్నారు.

ఆలయాల్లో చోరీ



మల్లికార్జునస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టిన దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): శ్రీమల్లికార్జునస్వామి, ఎల్లమ్మదేవి ఆలయాల్లో గుర్తుతెలియన వ్యక్తులు చోరీ చేశారు. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామానికి చెందిన గొల్ల కొమురయ్య బుధవారం పూజలు నిర్వహించి సాయంత్రం మల్లన్న, ఎల్లమ్మదేవి ఆలయాలకు తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చిచూడగా గుడి బయట ఆలయాల్లోని ఐదు హుండీలు పగులగొట్టి ఉన్నాయి. భక్తులు నగదు రూపంలో సమర్పించిన కానుకలు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి




గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మెదక్ రూరల్: చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని కొంటూరు చెరువు కట్ట వద్ద చేగుంటకు వెళ్లే రోడ్డులో మానసిక స్థితి సరిగ్గాలేని గుర్తుతెలియని వ్యక్తిని మార్చి 5వ తేదీన ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎడమ కాలు, ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ వ్యక్తిని గుర్తిస్తే మెదక్ రూరల్ ఎస్ఐ 8712657917 సీఐ 8712657916 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లింక్ ఓపెన్ చేసినా.. ఫోన్ మాట్లాడినా

సైబర్ ఉచ్చులో పడతారంటున్న సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు ఓపెన్ చేయడం...డిస్‌ప్లేలో ఇచ్చే నంబర్లకు కాల్ చేయడం లాంటివి చేయవద్దని సిద్దిపేట సీపీ శ్వేత సూచించారు. లింక్ ఓపెన్ చేసినా, కాల్ చేసినా సైబర్ నేరగాళ్లు ఉచ్చులోకి లాగుతున్నారని ఆమె చెప్పారు. సైబర్ మోసాల పట్ల ప్రతిరోజు మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గురువారం సిద్దిపేట పరిధిలో చోటుచేసుకున్న ఘటనలపై ఓ ప్రకటన విడుదల చేశారు.



- దుబ్బాక ఠాణా పరిధిలోని ఓ వ్యక్తి ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ కస్టమర్ కేర్ నంబరు కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. అందులో ఉన్న నంబరుకు కాల్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి ఓ యాప్ డౌన్‌లోడ్ చేసి, అందులో వివరాలు నమోదు చేయమని సూచించాడు. అది నమ్మిన బాధితుడు లింకులో వివరాలు నమోదు చేసుకోగా, ఖాతాలో నుంచి రూ.6,421 డబ్బులు డెబిట్ అయ్యాయి.
- సిద్దిపేట రూరల్ పీఎస్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ఓ బైక్ అమ్మకానికి ఉందనే ప్రకటన చూశాడు. అందులోని నంబరుకు కాల్ చేశాడు. సైబర్ నేరగాడు సూచించిన ఖాతాకు రూ.47,500 ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేదు. దీంతో సైబర్ మోసం జరిగినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేశాడు.
- సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పేపర్ ప్లేట్ల కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసి, అందులో ఉన్న ఫోన్ నంబరుకు కాల్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి మీ అడ్రస్‌కు మేమే డెలివరీ చేస్తామని, అందుకు గాను చార్జీలు చెల్లించాలని చెప్పాడు. దీంతో అది నమ్మిన బాధితుడు రూ.1,000 పంపించి మోసపోయాడు.
- ములుగు పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి లోకల్ పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్ఐను మాట్లాడుతున్నాను.. అర్జెంట్‌గా డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. అది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.20వేలు పంపించాడు. అనంతరం అది నిజం కాదని తెలుసుకొని 1930 నంబరుకు ఫిర్యాదు చేయగా బాధితుడు పోగొట్టుకున్న డబ్బును ఫ్రీజ్ చేశారు.
- గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే డబుల్ ఆదాయం వస్తుందని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన బాధితుడు రూ.1,45,000 పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత కొంత మొత్తం లాభం వచ్చినట్టుగా చూపించారు. కానీ వాటిని విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో తాను మోసపోయినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.1,15,000 పోలీసులు ఫ్రీజ్ చేశారు.